

11న ఉచిత సివిల్స్ కోచింగ్‌కు ప్రవేశ పరీక్ష

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 7: షెడ్యూల్డ్ కులాల రాష్ట్ర స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 11న రాత పరీక్ష నిర్వహించనున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు రాత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు టీఎస్‌స్టడీసర్కిల్.సీవో.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె తెలిపారు.





- నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో.. కార్మికులు, రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- ఇప్పటికే ఫ్యాక్టరీలకు సంబంధించిన బకాయిలకు కొన్ని నిధుల మళ్లింపు
- ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ షుగర్ ఫ్యాక్టరీకి నిధుల కేటాయింపు
- ఫ్యాక్టరీ పునరుద్ధరణ పనులు ప్రారంభమైతే పెరగనున్న చెరకు సాగు విస్తీర్ణం

పునరుద్ధరణ ఆశలు!

నిజామాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో ఫ్యాక్టరీ కార్మికులు, చెరకు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే కొన్ని బకాయిలకు నిధులను చెల్లించగా బడ్జెట్‌లోనూ నిధులను కేటాయించింది. బడ్జెట్ సమావేశంలోనూ ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తామని ప్రకటించడంతో రైతుల్లోనూ ఆశలు పెరుగుతున్నాయి. ఫ్యాక్టరీలకు పూర్వవైభవం వస్తే చెరకును ఎక్కువ మొత్తంలో సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నిజాంసాగర్‌తో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీళ్లు అందుబాటులో ఉండటం వల్ల చెరకు ఎక్కువ మొత్తంలో సాగు కానుంది. ఫ్యాక్టరీ ప్రారంభమైతే సంవత్సరంలోపే క్రషింగ్‌కు సరిపోయేంత చెరకును పండించేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ పనులు ప్రారంభం కాగానే రైతులకు అవగాహన కల్పించడంతో పాటు చెరకు సాగుకు చర్యలను చేపట్టనున్నారు. ఫ్యాక్టరీలో ఉన్న మిషనరీ పురాతనమైనది కావడంతో ఆధునీకరించి ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఫ్యాక్టరీ ప్రారంభమైతే కార్మికులతో పాటు రైతులకు ఉపయోగపడనుండటంతో ఎక్కువ మంది పునరుద్ధరణ కోసం ఎదురు చూస్తున్నారు.

నిజాం హయాంలో ఫ్యాక్టరీ ప్రారంభం

నిజాం హయాంలో బోధన్‌లో నిజాం షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో చెరకును సాగు చేస్తూ ఫ్యాక్టరీకి సరఫరా చేసేవారు. ప్రత్యేకమైన రైలు మార్గాన్ని వేసి చెరకును తరలించారు. ఆసియాలోని అతిపెద్దదైన ఈ ఫ్యాక్టరీని నిజాం మొదట ప్రారంభించారు. ఈ ఫ్యాక్టరీ తర్వాత జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ముత్యంపేటలో మరొక ఫ్యాక్టరీని, మెదక్‌లోనూ ఇంకో ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్యాక్టరీకి అనుబంధంగా వాటిని నడిపించారు. చాలా ఏళ్లపాటు విజయవంతంగా ఈ చక్కర కర్మాగారం నడిచింది. వందలాది కార్మికులతో పాటు వేలాది మంది రైతులకు ఈ ఫ్యాక్టరీ ఉపయోగపడింది. ఫ్యాక్టరీపై ఆధారపడి వ్యాపారస్తులు, ఇతర వర్గాలు కూడా లబ్ధిపొందాయి. ఈ ఫ్యాక్టరీ బోధన్‌లో ఉండటం వల్ల పట్టణాభివృద్ధికి కూడా ఉపయోగపడింది. ఫ్యాక్టరీ పరిధిలో సుమారు 20వేల ఎకరాలకు పైగా చెరకును సాగు చేశారు. ఏళ్లతరబడి నడిచిన ఈ ఫ్యాక్టరీ తర్వాత టీడీపీ హయాంలో ప్రభుత్వ, ప్రైవేటు పార్టనర్‌షిప్‌కు మారింది. ప్రైవేటు యాజమాన్యం ఆధ్వర్యంలో కొనసాగింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015 డిసెంబర్ 22 లో ఫ్యాక్టరీకి లే ఆఫ్ ప్రకటించారు. అప్పటి నుంచి ఫ్యాక్టరీ మూతపడే ఉంది. అప్పటి నుంచి ప్రభుత్వాలు ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు ముందుకు రాలేదు. ఎన్నికల్లో గత ప్రభుత్వం హామీ ఇచ్చిన పట్టించుకోలేదు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ప్రచారాన్ని కొనసాగించారు.

అనుబంధ ఫ్యాక్టరీలనూ తెరిపించేందుకు ప్రయత్నాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బోధన్‌లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీతో పాటు అనుబంధ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు ప్రయత్నాలను మొదలు పెట్టారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. బోధన్, మెదక్, ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీలను పరిశీలించారు. ఈ మూడు ఫ్యాక్టరీల పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశాన్ని నిర్వహించారు. ఫ్యాక్టరీలకు సంబంధించిన అప్పులు, ఇతర అంశాలపై దృష్టి సారించారు. అప్పులను సర్దుబాటు చేసేందుకు బ్యాంకు అధికారులతో, ఫైనాన్స్ సంస్థలతో చర్చలు జరిపారు. ప్రభుత్వం తరపున కొన్ని నిధులను విడుదల చేశారు. బకాయిలకు వాటిని మళ్లించారు. పునరుద్ధరణపై అధ్యయనాన్ని మొదలు పెట్టారు. ఫ్యాక్టరీలోని మిషనరీని సరిచూడటంతో పాటు ఇతర అంశాలపై దృష్టి పెట్టారు. బడ్జెట్‌లోనూ షుగర్ ఫ్యాక్టరీల కోసం నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులను వినియోగించి ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తామని బడ్జెట్ ప్రసంగంలో ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఫ్యాక్టరీపై సమగ్ర అధ్యయనం చేసి పునరుద్ధరించేందుకు చర్యలను చేపడుతున్నారు. ఈ మూడు ఫ్యాక్టరీలో మిషనరీలు పురాతనమైనవి కావడం వల్ల క్రషింగ్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉండటంతో ముందస్తుగా వాటిని పరిశీలించి అవసరమైతే మార్చేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త మిషనరీ తీసుకురావడం కానీ ఉన్నవాటిని మరమ్మతులు చేస్తూ ఆధునీకరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు పెట్టడం ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కట్టుబడి ఉండటం వల్ల మళ్లీ పూర్వవైభవం వచ్చే అవకాశం ఉంది. ఫ్యాక్టరీలోని మిషనరీ చక్కెర, బెల్లం తయారీతో పాటు డిమాండ్ ఉన్న ఇథనాలను ఎక్కువగా తయారు చేసే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇథనాల్‌కు డిమాండ్ ఎక్కువగా ఉండటం వల్ల చెరకు ఫ్యాక్టరీల పునరుద్ధరించడంతో పాటు లాభాల బాట పట్టించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న చక్కెర ఫ్యాక్టరీలను పరిశీలించడంతో పాటు అధునాతన టెక్నాలజీకి అనుగుణంగా మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. ఫ్యాక్టరీ పునరుద్ధరిస్తే ప్రస్తుతం ఉన్న కార్మికులతో పాటు కొత్త కార్మికులను కూడా తీసుకునే అవకాశం ఉంది. ఈ ఫ్యాక్టరీ పునరుద్ధరణ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతనే చేపట్టనున్నట్లు సమాచారం.

క్రషింగ్‌కు అనుగుణంగా చెరకు సాగు చేయాలి

షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరిస్తే చెరకు సాగు కావాల్సినంత ఉండాలి. ఫ్యాక్టరీ క్రషింగ్‌కు అనుగుణంగా షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరకు సాగు చేయాలి. షుగర్ ఫ్యాక్టరీ రన్నింగ్‌లో ఉన్న సమయంలో ఎడపల్లి, నవీపేట్, బోధన్, రెంజల్, కోటగిరి, రుద్రూర్, వర్ని, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ, బీర్కూర్ మండలాల పరిధిలో చెరకు సాగు చేసేవారు. ఫ్యాక్టరీ పరిధిలో సుమారు 20వేల ఎకరాల వరకు ఈ చెరకు సాగు అయ్యేది. నిజాం షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్‌కు సరఫరా చేసేవారు. ఫ్యాక్టరీలో క్రషింగ్ ఆరు నెలల పాటు జరిగేది. ఫ్యాక్టరీలో వందలాది మంది కార్మికులు పనిచేసేవారు. ఫ్యాక్టరీపై ఆధారపడి పలు వ్యాపారాలు కొనసాగేవి. రైతులకు కూడా లాభాలు వచ్చేది. చెరకు ఒకసారి చేస్తే మూడు నాలుగు సంవత్సరాల పాటు పండే అవకాశం ఉండటం వల్ల రైతులకు కూడా లాభాలు ఉండేది. ప్రస్తుతం చెరకు పంటకు డిమాండ్ కూడా ఎక్కువగా ఉంది. టన్నుకు ఎక్కువ మొత్తంలో ధర రావడంతో పాటు ఇథనాల్‌కు డిమాండ్ పెరగడం వల్ల రైతులకు కూడా ఎకరాకు లక్షన్నర వరకు ఆధాయం వస్తుంది. ఫ్యాక్టరీ పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తే జిల్లాలోని రైతులు కూడా మళ్లీ సాగుకు సన్నద్ధమయ్యే అవకాశం ఉంది. ఫ్యాక్టరీ పనులు ప్రారంభిస్తే సంవత్సరంలోపే చెరకు సాగు పెరగనుంది. ప్రభుత్వం నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని రకాల చర్యలు చేపట్టిందన్నారు. బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించిందని తెలిపారు. ఫ్యాక్టరీని ఆధునీకరించి పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.



కాకతీయ కాలువ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



లక్ష్మీకాలువకు నీటి విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, ప్రాజెక్టు అధికారులు

జిల్లాలో జల్లులతో కూడిన వర్షం

- చెరువుల్లోకి చేరుతున్న వరద

నిజామాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో జల్లులతో కూడిన వాన కురుస్తోంది. ఈ వానాకాలంలో సగటు వర్షపాతం కంటే ఎక్కువగానే వర్షం పడింది. చెరువులు, కుంటల్లో భారీగా నీళ్లు చేరకున్నాయి జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు 7.3 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా మోర్తాడ్ మండలంలో 20.9 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలో జూన్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు 496మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా 600 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో పడాల్సిన వర్షాలకంటే 104 మిల్లీమీటర్ల వర్షం ఎక్కువగా పడింది. జిల్లాలో పడుతున్న వర్షాలతో చెరువుల్లోకి కూడా వరదనీరు వచ్చి చేరుతుంది.

జిల్లాలో మొత్తం 996 చెరువులు ఉండగా ఇప్పటి వరకు 73 చెరువులు పూర్తిస్థాయిలో నిండి మత్తడులు పారాయి. జిల్లాలో 439 చెరువుల్లో 75 శాతంకు పైగా నీళ్లు చేరాయి. జిల్లాలోని 298 చెరువుల్లో 75 శాతంలోపు నీళ్లు రాగా 139 చెరువుల్లో 50 శాతంలోపు నీళ్లు చేరాయి. కేవలం 47 చెరువుల్లో మాత్రమే 25 శాతంలోపు నీళ్లు ఉన్నాయి. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు పడిన వర్షాల వల్ల ఈ వరద చెరువుల్లోకి చేరింది.

ప్రతీ నీటి చుక్కనూ సద్వినియోగం చేసుకోవాలి

- గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలకు నీటిని విడుదల చేయాలి
- కాకతీయ, లక్ష్మీ కాలువలకు నీటి విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మెండోర/ముప్కాల్, ఆగస్టు 7: కాకతీయ, లక్ష్మీకాలువల ఆయకట్టు రైతులు ప్రతీ నీటి చుక్కని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండంలోని శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు కాకతీయ, లక్ష్మీకాలువలకు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నీటిని విడుదల చేశారు. అనంతరం కాకతీయ కాలువ వద్ద పూలు చల్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ అయకట్టు కింద 4లక్షల60వేల ఎకరాలకు, లక్ష్మీకాలువ అయకట్టు కింద 25వేల ఎకరాల సాగుకు నీటి విడుదల చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాకతీయ, లక్ష్మీకాలువలకు ఎలాగైతే నీటిని విడుదల చేయడానికి ఆదేశాలు ఇచ్చారో.. అదే విధంగా గుత్ప ఎత్తిపోతలకు నీటి విడుదల చేస్తే ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ రైతులు అలీసాగర్, ఎత్తిపోతలకు నీటి విడుదల చేస్తే బోధన్ రైతులు చెరువులు నింపుకొని పంటలు సాగు చేసుకుంటారని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మనుసుతో రాజకీయాలు పక్కన పెట్టి రైతులను దృష్టిలో పెట్టుకొని నీటిని విడుదల చేయాలని కోరారు. ఎస్సారెస్పీ లక్ష్మీ లిఫ్ట్ ద్వారా 15రోజుల క్రితమే నీటిని విడుదల చేయాల్సి ఉండగా ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేయలేదని, కారణలేమైన నీటి విడుదల చేయడం సంతోషం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా, జెన్‌కో సీఈ రమేష్, జెన్‌కో ఎస్ఈ శ్రీనివాస్, ప్రాజెక్టు ఈఈ చక్రపాణి, మెండోర, ముప్కాల్, బాల్కొండ నాయకులు పాల్గొన్నారు.



ఓబీసీ సభకు హాజరైన జిల్లా నేతలు

జాతీయ ఓబీసీ మహాసభలో జిల్లా నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 7: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరుగుతున్న 9వ జాతీయ ఓబీసీ మహాసభలో జిల్లాకు చెందిన ఓబీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు. మండల్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 7న నిర్వహించే జాతీయ మహాసభలు అమృత్‌సర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సభలో పాల్గొనేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు అమృత్‌సర్ వెళ్లారు. దేశవ్యాప్తంగా బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై సభలో మాట్లాడారు. కులగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, నాయకులు ఆకుల ప్రసాద్, కరిపె రవీందర్, వినోద్, శంకర్, శ్రీలత పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

తల్లిపాల వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 7: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ అంకిత్ ఛాంబర్‌లో వారోత్సవాల పోస్టర్‌లను ఆవిష్కరించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని, తల్లిపాల వల్ల బిడ్డలకు కలిగే ప్రయోజనాలు వివరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారిని రసూల్‌బీ, స్వర్ణలత, నందిని, ఇందిర పాల్గొన్నారు.

పంద్రాగస్టు తర్వాత హెల్మెట్ తప్పనిసరి

- పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫ్లెక్సీల ఏర్పాటు
- వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఖిల్లా, ఆగస్టు 7: ఆగస్టు 15 తర్వాత వాహనదారులు హెల్మెట్ ధరించాలని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కల్పించేందుకు నగరంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నగరంలోని రెండో టౌన్ పరిధిలో గల ఆర్ఆర్ చౌరస్తా వద్ద భారీ ఫ్లెక్సీని పోలీసులు ఏర్పాటు చేశారు. వాహనదారులు పాటించాల్సిన అంశాలను ఆ ఫ్లెక్సీలో పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణహాని జరగకుండా ఉండేందుకు ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కొన్ని ఛానళ్లలో వస్తున్న వదంతులను నమ్మవద్దని పోలీసు అధికారులు తెలిపారు.



హెల్మెట్ వాడకంపై నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

‘రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి’

బోధన్‌రూరల్,ఆగస్టు7: బస్తీ దవాఖానాలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల బస్తీదవాఖానాను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవాఖానాలో వైద్యులను నియమిస్తామన్నారు.అలాగే బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి విభాగంలో గైనాకాలజిస్టు వైద్యురాలిని నియమిస్తున్నామన్నారు. ప్రజలు సమన్వయం పాటిస్తూ వైద్యసేవలు అందుకోవాలన్నారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్ రెడ్డి, పాషా మొయినోద్దీన్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి తదితరులున్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



రామన్నపేట్‌లో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

వేల్పూర్, ఆగస్టు7:మండల గ్రామమైన రామన్నపేట్‌లో తెడ్డు మాదిగ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఎస్సీవర్గీకరణ కోసం చేసిన ఉద్యమస్ఫూర్తిని మాదిగలు కొనియాడుతూ గ్రామంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయవాదుల బెంచీ తీర్పు ఇవ్వడం హర్షనీయమన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల వారు 30ఏళ్ల ఉద్యమం ఫలితం మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో తెడ్డు మాదిగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇటీవల అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మానికొళ్ల గంగాధర్, జీవన్, బీజేపీ నాయకులు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వర్ని: సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ బుధవారం వర్ని మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పోరాట కృషి ఫలితమే కోర్టు తీర్పుకు నిదర్శనంగా వారు అభిప్రాయపడ్డారు. తీర్పునిచ్చిన న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలి

● అదనపు కలెక్టర్ అంకిత్



భీమ్‌గల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



జానకంపేటలో నాటిన మొక్కలను పరిశీలించిన డీఆర్డీవోపీడీ



ధర్మారం(బి)లో మొక్కను నాటుతున్న జడ్పీ సీఈవో ఉషా

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు7: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యమైన భోజనం అందజేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం భీమ్‌గల్ పట్టణంలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బాలికల ఉన్నత పాఠశాల, మైనారిటీ పాఠశాలను అదనపు కలెక్టర్ అంకిత్ సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని సందర్శించారు.మధ్యాహ్న భోజనం వండే ప్రదేశం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు.ఈసందర్భంగా మైనారిటీ పాఠశాలలో అదనపుకలెక్టర్ అంకిత్ మొక్కలునాటారు. ఈ కార్య క్రమంలో కమిషనర్ రామకృష్ణ, ఎంఈవో స్వామి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్, వైస్‌ఛైర్మన్, కౌన్సిలర్‌లు,అధికారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: సీజనల్‌వ్యాధులబారిన ప్రబకుండా ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అదనపు అంకిత్ అన్నారు. బుధవారం మండలంలోని హసాకొత్తూర్ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలప్లేగ్రౌండ్‌లో మొక్కలను నాటారు. గ్రామప్రత్యేక అధికారి ఆంధ్రయ్య, ఎంపీవో సదాశివ్, ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏ, గ్రామస్థులు, అంగన్‌వాడీ టీచర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని బెల్లాల్, అమ్దాపూర్ తదితర గ్రామాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలలో మొక్కలు నాటారు. ఆయన వెంట ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు ఉన్నారు.

● సాలూరలో..

సాలూర మండల కేంద్రంలో తహసీల్దార్ రమేష్ స్థానిక జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ అల్లె జనార్ధన్, ఈవో ప్రవీణ్, హెడ్‌మాస్టర్ మంజూష, ఐకేపీ మణి, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ షమీమ్ బాను, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: గ్రామాల్లో చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ అన్నారు. బుధవారం నందిపేట మండలంలోని ఆంధ్రనగర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అలాగే నందిపేట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి డీపీవో తరుణ్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీవో తరుణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. ముఖ్యంగా ప్రజలకు పారిశుధ్యం, ఆరోగ్యం గురించి అవవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు మాట్లాడుతూ నాటిన ప్రతీ మొక్కను పెంచే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రావు, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ శాంతికుమారి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మందమహిపాల్, నియోజక వర్గం యువజన నాయకులు బైండ్లప్రశాంత్, ఆంధ్రనగర్, నందిపేట మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శి వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

ఎడపల్లి: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని వాటిని సంరక్షించినపుడే నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సాయాగౌడ్ అన్నారు.బుధవారం ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామశివారులలోని శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయం వద్ద నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీడీవో,ఏపీవో, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రుద్రూరు: మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో నిర్వహించారు. గ్రామంలోని పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి నిర్మల, ఎంపీడీవో సురేష్‌బాబులు పేర్కొన్నారు.బుధవారం రుద్రూరు మండల కేంద్రంలో మూడోరోజు స్వచ్ఛ దనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిసరాలను పరిశుభ్రం చేయడం, మురికి కాలు వలను తీయించారు.ఈ కార్యక్రమాలలో డిప్యూటీ తహసీల్దార్ సురేందర్ నాయక్, ఆర్ఐ నజీర్, హెల్త్‌సూపర్ వైజర్ రవి, ఏపీవో మనోహర్, జీపీ కార్యదర్శి గంగాధర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాల్కొండ నియోజకవర్గ అధికారులతో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధిపై బుధవారం మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు చేరడంలో ఉన్న ఇబ్బందులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతు రుణమాఫీ, ధరణి సమస్యలు, ఎన్ఎంఆర్ ఈజీఎస్ పనులు, ఉచిత సిలిండర్, 200యూనిట్ల విద్యుత్,పాఠశాల సంబంధించిన, వివిధ అంశాలపై పడుతున్న ఇబ్బందులు, వాటిపరిష్కరించడంలో తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు.అంతకు ముందు స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో, నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్, ఎంపీడీవోలు, మండలఅధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని బినోల, ఆశాజ్యోతి కాలనీలలో బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఖాళీ స్థలాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, శ్రీవాణి అన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఒడ్డెరకాలనీ ప్రభుత్వ పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పాఠ శాల ఆవరణలో స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత మొక్కలను నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలకు నీళ్లు పోసి సంరక్షించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాందేశ్ సత్యం, మున్సిపల్ అధికారులు షకీల్, చక్రధర్, ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:రాష్ట్రప్రభుత్వం మహోన్నతఆశయంతో ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అందరు భాగస్వామ్యులు కావాలని పచ్చదనం కోసం మొక్కలునాటి పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఉషా అన్నారు. బుధవారం స్వచ్ఛభారత్ పచ్చదనంలో భాగంగా మండలంలోని ధర్మారం(బి)లో ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ భవనం పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మురుగు కాల్వలు నిండి పోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని రక్షిత ట్యాంకులను క్లోరినేషన్ చేస్తూ తాగు నీటిని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి యోహన్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో, కార్యదర్శి అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

● 600 మొక్కలను గ్రామస్థుల ఆధ్వర్యంలో నాటారు

మండలంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోగల యూపీఎస్ పాఠశాలలో 600మొక్కలు ఈవో నిట్టు కిషన్‌రావు, హెచ్ఎం సురేశ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మూకుమ్మడిగా నాటారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటి సంరక్షణ కు అంత కంటే ముఖ్యమని ఈవోకిషన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రజత్ కుమార్, సంతోశ్, రాము, పాల్గొన్నారు.

మాక్లూర్:మాక్లూర్ మండల గ్రామమైన చిక్లీలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించాలని అదే విధంగా మొక్కలను నాటాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో స్పెషల్‌ఆఫీసర్ అనిల్, వైద్య సిబ్బంది రేణుక, ఐసీడీఎస్ సిబ్బంది, సెక్రెటరీలు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండ లంలోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, రైతు వేదికలు,పల్లె ప్రకృతి వనాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువైద్యశాల వద్ద పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు, మురుగు కాలువల్లో దోమల నివారణకై ఫాగింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివచరణ్, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, ఆశావర్కర్‌లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

రెంజల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో చేపడుతున్న పనులను బుధవారం డీఎల్‌పీవో మధుకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చెత్తను, ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

యానంపల్లిలో లేగదూడపై చిరుతదాడి

● లేగదూడ కళేబరం లభ్యం ● భయాందోళనలో గ్రామస్థులు ● ఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు



లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

డిచ్‌పల్లి,ఆగస్టు 7: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని యానంపల్లి అటవీ పరిధిలో గత రెండు రోజుల క్రితం లేగదూడపై చిరుత దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇందల్వాయి అటవీ శాఖ అధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. యానంపల్లి శివారులోని తోట మనోజ్ కుమార్ కు చెందిన కొట్టంలో లేగ దూడపై మంగళవారం తెల్లవారు జామున చిరుత దాడి చేసింది. ఉదయం వచ్చే సారి లేగదూడ మరణించడంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వినయ్, శ్రీకాంత్ లు ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేంజ్ అధికారి రవి మోహన్ భట్ మాట్లాడుతూ.. లేగదూడపై చిరుత దాడి చేసినట్లు ప్రాథమిక గా గుర్తించామని ఆయన తెలిపారు. కాగ చిరుత సంచార వార్తతో యానంపల్లి గ్రామంలో భయందోళన నెలకొన్నాయి.

గ్రామాల్లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



అంగన్‌వాడీ కేంద్రంలో పాల ప్యాకెట్లను అందజేస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి,ఆగస్టు7:తల్లిపాలవారోత్సవాలను అన్నిగ్రామాల్లోఅంగన్ వాడీ కార్యకర్తలు తల్లిపాలవారోత్సవాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని సూపర్‌వైజర్ బుజ్జి అన్నారు. బుధవారం మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె హాజరై మాట్లాడారు.పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్లవ్యాధి నిరోధక శక్తి పెరుగుతోందని అమృతంతో సమానమని ఈపాలల్లో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. తల్లిపాలు ఇవ్వడంతో తల్లికి ఎలాంటి సమస్యలు రావని, రొమ్ముక్యాన్సర్ రాకుండా అడ్డుకుంటుందన్నారు. సమాజంలో బిడ్డ చెడువసనలకు దూరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ ఎంబాను, ఆరోగ్య సిబ్బంది సుమలత, టీచర్స్, ఆశ వర్కర్స్, కార్యదర్శి శ్రవణ్ పాల్గొన్నారు.

● రాంపూర్‌లో తల్లిపాల వారోత్సవాలు

మండలంలోని రాంపూర్‌లో ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఆరోగ్య కార్యకర్త సుమలత ప్రారంభించారు.పుట్టిన బిడ్డకు తల్లిపాలు మాత్రమే తాగించాలని శారీరక పరిపుష్టికి తల్లిపాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు.శిశువుజబ్బు చేసిన తల్లిపాలేతాగించలన్నారు.తల్లి నుంచి శిశువుకు తల్లి వెచ్చదనం లభిస్తుందన్నారు.ఈకార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌డీ రేణుక,అంగన్‌వాడీ సిబ్బంది ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

మాక్లూర్: మాక్లూర్ మండల గ్రామమైన చిక్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందించాలని ఎంపీవో శ్రీనివాస్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని చిక్లీ గ్రామంలో ఆయన పాల్గొన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అనిల్, వైద్యసిబ్బంది రేణుక, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీలు, పంచాయతీసెక్రెటరీలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: పుట్టిన గంట నుంచి ఆరునెలలవరకు బిడ్డకు తల్లి పాలు పట్టడం శ్రేయస్కరమని, బిడ్డకు ఈపాలు మంచి ఆరోగ్యనిస్తాయని రోగనిరోధక శక్తిని పెంచుతాయని హెల్త్‌సూపర్‌వైజర్ స్వరూప అన్నారు.బుధవారం కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్‌లో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాలు, పౌష్టికాహారం తదితర అంశాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం రూప, ఐకేపీ అధ్యక్షురాలు మౌనిక, మేఘన,లక్ష్మీ, లాడెలలిత, వీవోఏ లత, అంగన్‌వాడీ టీచర్లులక్ష్మీ, పుష్ప, ఆయాలు బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి పంచాయతీ పరిధిలోని అంజుమాన్ ఫారం, నవీపేట, అబ్బాపూర్(బి)లలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో స్వర్ణలత, సూపర్‌వైజర్‌లు భాగ్యలక్ష్మి, రాధాలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం



ఈరవత్రి అనిల్‌ను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘ అధ్యక్షుడు శేఖర్

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు7: పట్టణంలోని పద్మశాలి సంఘం మూడో తర్ఫ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా చేనేత సహకార సంఘంలో పని చేస్తున్న చేనేత కార్మికులను పట్టుశాలువ,పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిట్ల యగ్నేష్ మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పద్మశాలి సంఘం మూడో తర్ఫ కార్యదర్శి న్యాక మోహన్, గురుడు రాంచందర్, దోమల శ్రీనివాస్, అంబాటి శీను, చిట్లచిన్న గంగాధర్, గణపతి, శేఖర్, శీను, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండల కేంద్రంలో చేనేత సహకార సంఘంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ నేత కార్మికులు సుప్పల స్వామి, మోత్కూరి నడ్పి గంగారాం, గట్టు సాయిలు, నూత్‌పల్లి నాగమణిలను సత్కరించారు. చేనేత సంఘం అధ్యక్షుడు మోత్కూరి నారాయణ, మాజీ డైరెక్టర్లు జువ్వల పోతన్న, మాదాస్ మారుతి, మోత్కూరి శంకర్, సంఘం సభ్యులు హన్మాండ్లు, గంగుల గంగాధర్, టి.విజయ్, హంగర్గ గంగాధర్, సంగయ్య, తొప్పరి హన్మాండ్లు, సంఘం సిబ్బంది ఈర్వ నాగరాజు, అంకం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు సీట్ శేఖర్ కోరారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఖనిజ అభివృద్ధి సంస్థ ఈరవత్రి అనిల్‌ను ఆయన కలిశారు. అనంతరం శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. చేనేతను అభివృద్ధి చేయాలని, పద్మశాలిల అభివృద్ధికి కోసం నిధులు మంజూరు చేయాలని, పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈరవత్రి అనిల్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్సై గంగాధర్

మాక్లూర్, ఆగస్టు7: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇన్‌చార్జి ఎస్సై గంగాధర్ కోరారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కళాబృందం బుధవారం మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాటకాలు, పాటలతో అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, రోడ్డు నియామలు పాటించాలన్నారు. అత్యవసర సమయంలో 100 నెంబర్‌కు డయల్ చేయాలని అన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇందుకు సంబంధించి 1930టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగారాంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



వేల్పూర్ ధర్నా చేస్తున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు

వేల్పూర్, ఆగస్టు7: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు ఆరు గ్యారెంటీ పథకాలు అమలుపర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం వేల్పూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) డివిజన్ కార్యదర్శి బి.దేవరాం మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులతో పాటు ఆరు గ్యారెంటీ పథకాలను పేదలకు అందజేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు ఎలాంటి రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడం బాధకరమన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని, తెల్ల రేషన్‌కార్డులను విడుదల చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకులు అమీనాపూర్ రాజేశ్వర్, నరేందర్, మాచర్ల రాజన్న, అనిల్‌కుమార్, మమత, కలిగోట రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యం పట్టుకున్న అధికారులు

కోటగిరి,ఆగస్టు7:కోటగిరి మండల కేంద్రంలోని ఓరైస్‌మిల్లులో సుమారు 270క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్నిడీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులుపట్టుకున్నారు. మండల కేంద్రంలోని ఎత్తొండ రహదారిలో ఓ రైస్‌మిల్లుపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యంతో ఉన్న లారీని అధికారులు పట్టుకున్నారు. డీటీ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారి నిఖిల్ రాజ్ బుధవారం లారీని పరిశీలించారు. లారీలో ఉన్న పీడీఎస్ బియ్యంతో పాటు లారీని సీజ్ చేశారు. సుమారు 4.50లక్షల విలువ కలిగిన బియ్యాన్ని పట్టుకున్నామని ఆయన తెలిపారు. పక్క సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. గత పది రోజుల క్రితం ఇదే రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టుబడడం విశేషం. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెల్లడించారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం, రుద్రూర్ సీఐ జయేష్‌రెడ్డి, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.


చేనేత కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

చేనేతల బతుకులు మారడం లేదు

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, ఆగస్టు 7: ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా చేనేతల బతుకులు మారడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేనేత కార్మికుల సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక నరేంద్ర మోదీ స్వదేశీ వస్తువుల వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టి వారిని ప్రోత్సహించే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. చేనేత కార్మికుల త్యాగాలను వారి శ్రమను గుర్తించిన మోదీ 2015 ఆగస్టు 7న చెన్నైలో జరిగిన కార్యక్రమంలో భారతదేశ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రారంభించి భారత చేనేత లోగోను ఆవిష్కరించడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరుతో చేనేతలకు పని కల్పిస్తామని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైన చేనేతలకు చేతినిండా పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మోర్చా జిల్లా నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

మోపాల్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బోర్గాం(పి) 62వ తర్ప అధ్యక్షుడు వేముల కిషన్, కార్యదర్శి రచ్చ ఆంజనేయులను బుధవారం తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి శాఖ చైర్మన్ ఈరవత్రి అనిల్ నగరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు ఐక్యమత్యంతో ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పద్మశాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విజ్ఞాన్ స్కూల్‌లో జాతీయస్థాయి ఖేలో ఇండియా టాలెంట్ నిర్ధారణ పోటీలు


సెలక్షన్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 7: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత్ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఖేలో రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ కార్యక్రమం బుధవారం నగరంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా అంశాలలో విద్యార్థులు పాల్గొనగా కోచ్‌లు క్రీడాకారులను ఎంపిక చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం విద్యార్థుల ఎంపికను నిర్వహించింది. ఈ ఎంపికలో కబడ్డీ కోచ్ శ్రీనివాస్‌రావు, అథ్లెటిక్స్ కోచ్ సుబ్బారావు పాల్గొన్నారు. సుమారు 300 మంది విద్యార్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ జయసింహాగౌడ్ తెలిపారు.

భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు గణితబోధన మినహాయింపు ఇవ్వాలి


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 7: పాఠశాల సమయ సారినిలో భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు 6, 7 తరగతుల గణిత బోధనపై మినహాయింపు ఇవ్వాలని ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ జిల్లా శాఖ ప్రతినిధులు బుధవారం డీఈవో దుర్గాప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఇచ్చిన రిఫరెంట్ నెంబర్ 156 ప్రకారం పాఠశాల టైంటేబుల్‌లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు మరియు గణితశాస్త్ర ఉపాధ్యాయులకు సమాన భారత్వమును పాటించే విధంగా ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ నామినేషన్స్, సైన్స్ ఎగ్జిబిషన్స్, ప్రాక్టికల్స్ మొదలైన 23 రకాల కార్యక్రమాలు నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నందున 6, 7 తరగతులకు గణితశాస్త్ర బోధన నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, అసోసియేట్ ప్రసిడెంట్ లక్ష్మణ్, రఘునాథ్, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గాయపడ్డ జింక



డొంకేశ్వర్, ఆగస్టు 7: మండలంలోని సిర్పూర్ ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో నీటి ప్రవాహం పెరుగుతున్నా కొద్ది జింకలకు అవాసం లేక ఊరిలోకి వస్తున్నాయి. దీంతో ఊర కుక్కలు జింకలపై దాడులకు పాల్పడుతున్నాయి. తాజాగా సిర్పూర్ గ్రామంలో ఉన్న ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఉన్న జింకపై కుక్కలు దాడి చేశాయి. స్థానికులు జింకను చికిత్స చేసి అనంతరం చిన్నాపూర్ అర్బన్ పార్కు ముందు పరిశీలనకు ఉంచారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సహాయ డాక్టర్ దర్శోజీ బీట్ అధికారి ప్రసాద్, గ్రామసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ అధికారుల తీరుపై మంత్రికి ఫిర్యాదు

- ముగ్గురు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు ఉన్నా.. నీటి విడుదలకు పిలుపు లేదు
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

మెండోర, ఆగస్టు 7: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు నీటిని విడుదల చేసే క్రమంలో ఎస్సారెస్పీ అధికారులు స్థానిక ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గంలో ఉన్న ముగ్గురు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లకు సమాచారం అందించని తీరుపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి ఎస్సారెస్పీ అధికారులపై ఫిర్యాదు చేయనున్నట్లు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం నియోజకవర్గంలో పర్యటించి పోచంపాడ అతిథి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన మాజీమంత్రి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నియోజకవర్గంలో ఉన్న ముగ్గురు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లకు నీటి విడుదల సమాచారం ఇవ్వకపోవడం వల్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని బట్టి చూస్తే ఇంకా అధికారులు బీఆర్ఎస్ నాయకుల వైపే ఉన్నట్లు అర్థమవుతుందన్నారు. నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ చీఫ్ ఇంజనీర్లకు అధికారుల తీరుపై అన్వేష్‌రెడ్డి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. నాటి ప్రభుత్వం ప్రాజెక్టులో 50టీఎంసీలు ఉన్నా కానీ ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేసి దాఖలాలు లేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దృష్టిలో పెట్టుకొని కాకతీయ, లక్ష్మీ, సరస్వతి ఆయకట్టు రైతుల బాగు కోసం ప్రాజెక్టులో 46టీఎంసీలు మీరు ఉన్నా కూడా విడుదల చేస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కిసాన్‌ఖేత్ కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి సాగర్, సంతోష్‌కుమార్, మల్లారెడ్డి రవి, సాగర్, కిసాన్, మైలారం శీను, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో రూ.100కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 7: ఆర్మూర్ నియోజకవర్గానికి ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి రూ.100కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల అసెంబ్లీలో తాను మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంతానికి జరిగిన అన్యాయం, గల్ఫ్ బాధితుల గోడు, పింఛన్‌లు, రేషన్‌కార్డులు, తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను కొడంగల్, మదిర, ఆర్మూర్‌లో పైలెట్ ప్రాజెక్టులుగా ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన సుమారు ఐదు వేల మంది విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యబోధన అందిస్తారన్నారు. అయిలాపూర్ వసతిగృహం విషయం కూడా చెప్పానని, స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారన్నారు. జిల్లా కలెక్టర్ అధికారుల ద్వారా ప్రతిపాదనలు తయారు చేసి రూ.2కోట్ల 40లక్షల మంజూరుకు నివేదిక పంపారన్నారు. గల్ఫ్‌బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నామని, రూ.1000కోట్లతో గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరామని, సుమారు వంద కోట్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. కాగా, ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం గళమెత్తిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని బుధవారం మండలంలోని అంకాపూర్ గ్రామంలో గల్ఫ్ కార్మిక సంఘాల సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎంఆర్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి నాయకత్వంలో ఎన్ఆర్ఐల భవనం, గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.1000కోట్ల సాధనకు పార్టీలకు అతీతంగా కలిసి నడుస్తామన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి..

మాక్లూర్: వన మహోత్సవంలో ప్రతీఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నాపూర్ అర్బన్‌పార్కులు అటవీ శాఖ అధికారులతో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రెంజ్ అధికారి శ్రీనివాస్, అశోక్, సుధాకర్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సురేష్‌నాయక్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.


కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నల్ల బ్యాడ్జీలతో న్యాయవాదుల నిరసన

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 7: జనగాం జిల్లాలో న్యాయవాది దంపతులు గద్దల అమృతరావు గద్దల కవితారావులపై పోలీసుల దాడి నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ముందు న్యాయవాదులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. న్యాయవాద దంపతులపై జనగాం పోలీసులు అకారణంగా దాడి చేసి హింసించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. విధి నిర్వహణలో కేసుల వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన న్యాయవాదులపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అని అందుకు బాధ్యులైన సీఐ, ఎస్సై, కానిస్టేబుల్‌లపై తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేసి సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, లైబ్రెరి కార్యదర్శి పిల్లిశ్రీకాంత్, న్యాయవాదులు సురేష్, నరేందర్‌రెడ్డి, శ్రీధర్, బిట్ల రవి, నారాయణ, పులిజై పాల్, రాజ్ గోవర్ధన్, సత్యనారాయణ, హనుమంత్‌రెడ్డి, గణేష్, బిక్షపతి, అంజలి, మాణిక్‌రాజ్, ఆశనారాయణ పాల్గొన్నారు.

సబ్ డివిజనల్ డీఈఈగా హైమద్ హుస్సేన్

ధర్పల్లి, ఆగస్టు 7: ధర్పల్లి సబ్ డివిజనల్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా హైమద్ హుస్సేన్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలోగల సబ్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. గతంలో మండలంలోనే వర్క్ ఇన్స్‌పెక్టర్‌గా, పంచాయతీరాజ్ ఇంజనీర్‌గా పనిచేసిన హైమద్ హుస్సేన్ డిప్యూటీ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. ధర్పల్లి, సిరికొండ మండలాలకు చెందిన పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ పనుల్లో జాప్యం లేకుండా చూస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించడంపై పలువురు అభినందించారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, ఆగస్టు 7: దుబ్బ ఉపకేంద్రం పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏడీఈ తోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు దుబ్బ ఏరియా, పవన్‌నగర్, అంబేద్కర్ నగర్, సంజీవయ్య కాలనీ, ఆదర్శనగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. మిర్చి కంపౌండ్ ఉపకేంద్రం పరిధిలో ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు లలితమహల్ థియేటర్, శ్రద్ధానంద్‌గంజ్, శివాజీచౌక్, విజయలక్ష్మి టాకీస్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కల తొలగింపు

మోపాల్, ఆగస్టు 7: పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలు, గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను గ్రామ పంచాయతీ సిబ్బందితో అధికారులు తొలగింపచేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు గ్రామ పంచాయతీ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమం సక్రమంగా జరుగుతున్నది లేనిది తెలుసుకునేందుకు తహశీల్దార్ రామేశ్వర్, ఎంపిడివో రాములు గ్రామాలను సందర్శించి పరిశీలించారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామకార్యదర్శులకు ఆదేశించారు.

గ్రామాల్లో నిండిన చెరువులు



మోపాల్, ఆగస్టు 7: గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో మోపాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు నిండిపోవడంతో ఆయా గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని చెరువులు నిండటం వల్ల రైతులకు సాగునీరు పుష్కలంగా అందుతుందని పేర్కొన్నారు. మరికొన్ని రోజుల పాటు ఈ విధంగా వర్షాలు కురిస్తే చెరువులు అలుగులు పారుతాయని తెలిపారు. గ్రామంలో ఉన్న చెరువులు నిండటంతో ఆయా చెరువుల వద్ద రైతులు, ప్రజల సందడి నెలకొంది.

'ఉద్యోగుల సేవలు మరువలేనివి'

పెద్దబజార్, ఆగస్టు 7: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు, వైద్యుల సేవలు మరువలేనివని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బదిలీపై వెళ్తున్న పలువురు ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన వారి సేవలు ఎప్పుడూ గుర్తుంటాయని అన్నారు. అలాగే పదోన్నతి పొందిన వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమోహన్, టీఎన్‌జీవో అధ్యక్షుడు అలుక కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల వేధింపుల నుంచి కాపాడాలి

● తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన రైతులు

ధర్పల్లి, ఆగస్టు 7: మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన రైతులను అటవీ శాఖ అధికారుల వేధింపుల నుంచి కాపాడాలని తహసీల్దార్ ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథ ఆధ్వర్యంలో రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. రామడుగు గ్రామంలో 200 మంది పేదలకు 20 ఏళ్ల క్రితం 1150 సర్వే నెంబర్‌లో పట్టాలు ఇచ్చి సీఎల్‌డీపీ కింద నిధులు సైతం ప్రభుత్వం మంజూరు చేసిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు రైతులు సాగు చేస్తున్న భూములకు వెళ్లి అటవీశాఖ అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జాయింట్ సర్వే జరిపి పేదలకు భూమిని పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని వ్యవసాయ కార్మికులకు 12వేల జీవనభృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ నాయకులు దామోదర్, ఆశీష్, రవి, శ్రీను, శంకర్, అనిల్, ఆశన్న, సాయిలు, రాజన్న, గంగాదాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ధర్పల్లి, ఆగస్టు 7: మండలంలోని సీతాయిపేట గ్రామానికి చెందిన అంకం గంగనర్సు (46) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ బుధవారం తెలిపారు. జూలై 31న ఇంట్లో నుంచి ఉదయం 10గంటలకు వెళ్లిన గంగనర్సు ఇంతవరకు ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త రాములు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు. గతంలో గంగనర్సు పలుమార్లు ఇంట్లో చెప్పకుండా వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చేదని ఈ సారి తిరిగి రాకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

అర్బన్ నియోజకవర్గ నిధులను పంచాయతీరాజ్‌కు కేటాయించడం సరికాదు

● బీజేపీ నగర కార్పొరేటర్లు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 7: నియోజకవర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను కార్పొరేషన్‌కు కాకుండా పంచాయతీరాజ్‌కు కేటాయించడం సరికాదని వెంటనే నిధులను కార్పొరేషన్‌కు కేటాయించాలని నగర బీజేపీ కార్పొరేటర్లు బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు కలెక్టర్‌ను కలిశారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు ఐఏఎస్ స్థాయి అధికారి కమీషనర్‌గా ఉండి పటిష్టమైన ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఉన్నప్పటికీ నిధులను పంచాయతీరాజ్‌కు కేటాయించడం సరికాదన్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన కార్పొరేటర్ల ద్వారానే ప్రతిపాదనలు తీసుకోవాలని అలా కాకుండా ఓడిపోయిన నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడం సరికాదన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో న్యాలంరాజు, మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, సాయివర్ధన్, మెట్టువిజయ్, తదితరులు ఉన్నారు.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి

● టోల్ ఫ్రీ నంబరు 1064, 9281033233

సుభాష్‌నగర్, ఆగస్టు 7: విద్యుత్ శాఖలో అధికారులు లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతి రహిత వ్యవస్థ ఏర్పాటుకు నిబద్ధతతో పనిచేస్తున్నామని అన్నారు. ఎవరైనా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబరు 1064కు లేదా 9281033233 సెల్ ఫెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అవినీతి రహిత విద్యుత్ శాఖ కోసం వివిధ సర్కిల్‌లో వాల్ స్టిక్కర్‌లను, బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. టీజీఎన్‌పిడిసిఎల్ సంస్థ అత్యంత విలువలను ఆచరిస్తుందని విద్యుత్ వినియోగదారులకు సురక్షితమైన విశ్వసనీయమైన నిరంతరాయమైన నాణ్యమైన విద్యుత్‌ను సరసమైన ధరకు అందిస్తుందన్నారు. పై విలువలను సంస్థ సాధించడంలో విద్యుత్ వినియోగదారుల సహాయం కోరుతుందన్నారు.

పంటల వివరాల నమోదు పూర్తి చేయాలి


దత్తాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

డొంకేశ్వర్, ఆగస్టు7 పంటల వివరాలను ఏఈవోలు త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సెన్ ఆదేశించారు. బుధవారం మండలంలోని దత్తాపూర్ గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సర్వే నెంబర్ ఆధారంగా పంటల వివరాలను నమోదు చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జోష్న భవాని, ఏఈవో మౌనిక పాల్గొన్నారు.

రైతులకు రుణాల పంపిణీ


రైతులకు రుణాలు పంపిణీ చేస్తున్న సొసైటీ పాలకవర్గం

మోపాల్, ఆగస్టు 7: రైతులకు రుణాలను బుధవారం మోపాల్ సొసైటీ పాలకవర్గం సభ్యులు 46 మంది రైతులకు 24లక్షల 49వేల రూపాయలను పంపిణీ చేయడం జరిగిందని సొసైటీ చైర్మన్ గంగారెడ్డి తెలిపారు. సొసైటీ పరిధిలో ఉన్న రైతులకు దశల వారిగా రుణాలను ఎకరానికి 45వేల చొప్పున ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సొసైటీ పరిధిలోని రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పాలకవర్గం సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, నరేందర్‌తో పాటు ఆయా గ్రామాల డైరెక్టర్లు, కార్యదర్శి సాయి, రైతులు పాల్గొన్నారు.




చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,100	రూ.66,600	రూ.845

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (12.30, 7.15)
: కల్కి (3డీ తెలుగు) (3.30,10.15)
స్ర్కీన్-2 : శివం భజే (11.05, 4.50, 7.35,10.20)
: బడ్డీ (1.50)
స్ర్కీన్-3 : అరోన్ (హిందీ) (12.40,7.00,10.10)
: అలనాటి రామచంద్రుడు (3.50)
స్ర్కీన్-4 : రాయన్ (12.20,6.30)
: తిరగబడరా సామి (3.40)
: బడ్డీ (10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : బడ్డీ (తెలుగు) (1.35, 7.30)
: అరోన్ (హిందీ) (4.30, 10.20)
స్ర్కీన్-2 : కల్కి (తెలుగు) (10.25, 1.30, 10.30)
: రాయన్ (4.50, 7.40)
స్ర్కీన్-3 : రాయన్ (1.20, 10.40)
: కల్కి (4.10, 7.25)

దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : తిరగబడరా సామి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్